క్లుప్తంగా

కొనసాగుతున్న 'సదరం' క్యాంప్



తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునఃపరిశీలన కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి చెప్పారు.

వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు ప్రారంభం



తెనాలి అర్బన్: వీధి కుక్కల సంతానోత్పత్తి తగ్గించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం పట్టణంలోని పలు వార్డులలోని వీధి కుక్కలను ప్రత్యేక బృందాలు పట్టుకున్నాయి. వీటిని ప్రత్యేక వాహనంలో బుర్రిపాలెం రోడ్డులోని శస్త్ర చికిత్సాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆరోగ్యాధికారిణి కె. హెలెన్ నిర్మల మాట్లాడుతూ తెనాలి పట్టణంలో వీధి కుక్కల బెడదపై తరచు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సూచన మేరకు వీటిని పట్టుకుంటున్నట్లు చెప్పారు. శస్త్ర చికిత్సల అనంతరం పట్టుకున్న ప్రాంతంలోనే వీటిని వదిలిపెడతామని తెలిపారు. ఈ ప్రక్రియ పట్టణంలో కొద్దిరోజులు జరుతుందని చెప్పారు. వీధి కుక్కల వల్ల ఇబ్బందులు పడే వారు తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై అశ్రద్ధ వద్దు

తెనాలి అర్బన్: ప్రజల సమస్యలపై అశ్రద్ధ వద్దని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతిరావు సిబ్బందికి సూచించారు. అయితానగర్ డాంగేవారి వీధిలో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా తమ ఇంట్లో చెత్తను తడి, పొడిగా వేరుచేసి కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కాల్వలో గుర్తు తెలియని మృతదేహం



తెనాలి రూరల్: మండల పరిధిలోని ఆలీ నగర్ వద్ద కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. ప్యాంటు మాత్రమే ధరించి ఉన్న అతను మృతి చెంది నాలుగు రోజులై ఉంటుందని భావిస్తున్నారు. గుర్తు పట్టేందుకు వీల్లేని స్థితిలో మృతదేహం ఉంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి



తెనాలిరూరల్: రైల్లో నుండి జారి పడి ప్రయాణికుడు మృతి చెందిన ఘటన తెనాలి మండలం కొలకలూరు వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పటటటాల వెంబడి మృత దేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో విజయవాడ నుండి తెనాలికి తీసుకున్న టికెట్ ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృ దినోత్సవం జయప్రదం చేయాలి

మంగళగిరి: ఈనెల 11వ తేదీన మాతృ దినోత్సవం సందర్భంగా వీ వైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్ఫూర్తిదాయక కార్యక్రమాల్లో మహిళలంతా పాల్గొని విజయవంతం చేయాలని సంస్థ అధినేత రాగవీణ తెలిపారు. గురువారం మండలంలోని ఆత్మకూరు మిడ్ వ్యాలీ సిటీలో మహిళలను కార్యక్రమానికి ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. అదే రోజు సాయంత్రం ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు 3కే రన్, శారీ వాక్ నిర్వహించనున్నట్లు రాఘవీణ తెలిపారు.

తెనాలిలో కుండపోత వర్షం

- జలమయమైన రహదారులు
- ఈదురుగాలులకు నేలకొరిగిన భారీ చెట్లు



చినరావూరు పార్కు వద్ద వర్షపు నీటితో నిండిన రోడ్డు

తెనాలిఅర్బన్: పట్టణంలో గురువారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉకపోత, ఎండ కాస్తూ వచ్చింది. మధ్యాహ్నం ఒకసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు మొదట ప్రారంభమయ్యాయి. కొద్దిసేపటికి అతిభారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురుగాలులు తోడవడంతో పట్టణంలోని గాంధీనగర్, పినపాడు, మారీసుపేట, బుర్రిపాలెం రోడ్డు, నాజర్‌పేట వంటి ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. అలాగే వర్షపు నీరు కూడా భారీగా రోడ్లపై నిలిచింది. బోసురోడ్డు, చిట్టి ఆంజనేయ స్వామి గుడి రోడ్డు, మారీసుపేట రేపల్లె గేటు ఎదురు, ప్రక్క రోడ్డులు, బుర్రిపాలెం రోడ్డు, షరాఫ్‌బజార్, ఐతానగర్, నందులపేట, నాజర్‌పేట, తదితర ప్రాంతాల్లోని పలు రోడ్లు నీటితో నిండాయి. నాలుగు గంటల వరకు కుండపోత వర్షం కురుస్తునే వచ్చింది. వర్షం తగిన వెంటనే మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలాలు వర్షపు నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాల్వలను బాగు చేయించారు. వర్షపు నీరు కాల్వలో నుంచి బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టారు.

నిలిచిపోయిన రాకపోకలు

బుర్రిపాలెం రోడ్డు నుంచి అనంతవరం వరకు ప్రధాన రహదారిపై పలుచోట్ల భారీ వృక్షాలు కులాయి. ఇవి రోడ్డుకు అడ్డంగా పడటంతో అటువైపు వెళ్ళే ఆటోలు, ఆర్టీసీ బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. పట్టణంలో మున్సిపల్ అధికారులు, గ్రామాల్లో పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గంటల వ్యవధిలోనే వృక్షాలను రోడ్లపై నుంచి తొలగించారు. అనంతరం వాహనాల రాకపోకలు జరిగాయి.

పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి పట్టణంలో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. సుమారు 4గంటలపాటు విద్యుత్ అంతరాయం కలిగింది. గాంధీనగర్, కొత్తపేట, తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో రాత్రి 7 గంటల వరకు కూడా విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించలేకపోయారు. ఇంకా మరమ్మతులు చేస్తున్నే ఉన్నారు. ఆ ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



రోడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న



రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



బుర్రిపాలెం వద్ద ప్రధాన రహదారిపై కూలిన వృక్షం

పాక్‌తో యుద్ధానికి మాజీ సైనికులు సిద్ధం

- ఆంధ్రప్రదేశ్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు



మాట్లాడుతున్న శంకరరావు

తెనాలి: పాకిస్థాన్ తో యుద్ధానికి లక్షమంది మాజీ సైనికులు సిద్ధంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు చెప్పారు. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి, పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ దాడుల నేపథ్యంలో ఆయన గురువారం సాయంత్రం స్థానిక 'మా-ఏపీ' కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశరక్షణ కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సి వస్తే మాజీ సైనికుల సేవలను భారత ప్రభుత్వ రక్షణ శాఖ ఉపయోగించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

'మా-ఏపీ'లో కొందరు మాజీ సైనికులు సభ్యులుగా వున్నారని సంస్థ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. యుద్ధం అనగానే వారందరూ ఉద్విఘ్నతతో ఉన్నారని చెప్పారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గ నైజింగ్ కార్యదర్శి ఇనంపూడి రత్న ప్రసాద్ మాట్లాడుతూ, సెలవుల్లో ఉన్న సైనికులను విధులకు పిలిపిస్తున్న నేపథ్యంలో గతంలో యుద్ధ భూమికి వెళ్లిన అనుభవంతో మాజీ సైనికులను కూడా ఆహ్వానించాలని సూచించారు. పెహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్‌తో దెబ్బకు దెబ్బతీయటం గొప్పగా ఉందని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుసులూరి లక్ష్మీ నారాయణ చెప్పారు. వీరితో మాజీ సైనికుల సంక్షేమ సంఘ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వాకా ఆదినారాయణ ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి చెంచుపేటలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని డీఎస్పీ బి. జనార్ధనరావుకు గురువారం సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. 50 బస్తాల్లో రేషన్ బియ్యాన్ని, మరో 15 బస్తాల్లో నూకలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రంగా రేషన్ దందాకు పాల్పడుతున్న వ్యక్తే మరోసారి అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాన్ని పోలీసులు పరిశీలించారు. రేషన్ అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



తెనాలిరూరల్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి హమాలీలను కోరారు. గురువారం తెనాలి పినపాడులోని పౌర సరఫరాల స్టాక్ పాయింట్ గోడౌన్ వద్ద హమాలీలను కలిసి మే 20న నిర్వహించబోయే సార్వత్రిక సమ్మె ప్రాధాన్యతను వివరించి సమ్మె ర్యాలీలో పాల్గొనాలని సూచించారు. అనంతరం హమాలీలతో కలసి సమ్మెకు మద్దతుగా నినాదాలు చేశారు. ఆయన వెంట సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్ వలి ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో టీబీకి మందులు వాడుతున్న పలువురికి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలన్ని క్షయరహిత గ్రామాలుగా ఉండేందుకు కృషి చేస్తున్నటుల వెల్లడించారు. క్షయవ్యాధి ఉన్న రోగుల కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా అవసరమైన జాగ్రత్తలు వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు,హెల్త్ విజటర్‌లో పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'పై సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కాజ(మంగళగిరి): నగర పరిధిలోని కాజలో గురువారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. భారత్ సైనికులు పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై చేసిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డక బ్రహ్మయ్య, కూరాకుల బాపయ్య, ఆర్ల వెంకయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం

దుగ్గిరాల: పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీల సీనియర్ నాయకులు షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. గత నెల 22న జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు బలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మనదేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నించిందని.. భారత సైన్యం తగిన వ్యూహంతో అర్ధరాత్రి మెరుపు దాడులు చేశాయని ఆయన పేర్కొన్నారు.

హ్యూమన్ జెనెటిక్స్‌లో దేవరపల్లి ప్రీతికి డాక్టరేట్



తెనాలి: పట్టణానికి చెందిన దేవరపల్లి ప్రీతి ప్యాటిసియాకు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హ్యూమన్ జెనెటిక్స్ విభాగంలో ఆమె చేసిన పరిశోధనకు ఈ గౌరవం దక్కింది. 'కాంప్రహెన్షన్ ఆఫ్ న్యూక్లియోటైడ్ పాలీమార్ఫిస్ అండ్ ఫంక్షనల్ అన్నోటేషన్స్ ఫర్ టీఎస్ఎఫ్ ఆల్ఫా, ఇన్ డయాబెటిక్ న్యూరోపర్తీ పేషెంట్స్' అనే అంశంపై ఆమె పరిశోధన చేసి థీసిస్‌ను సమర్పించారు. తెనాలి చినరావూరుకు చెందిన దేవరపల్లి కిషోర్‌కుమార్ కుమార్తె ప్రీతి ప్యాటిసియా, స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో పాఠశాల విద్య, సాయి జూనియర్ కాలేజీలో ఇంటర్, జేఎంజే మహిళా కాలేజీలో బీఎస్సీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ చేసిన ప్రీతి, అదే యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్స్ అందుకుంటున్న తన్మయి నాగదుర్గ

మంగళగిరి టౌన్: ఢిల్లీలో ఏప్రిల్ 30 నుంచి మే 5వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో తన్మయి నాగదుర్గ ప్రతిభ చాటిందని నిర్మల స్కూల్ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అండర్ 11 బాలికల విభాగంలో రాష్ట్రం తరుపున నవులూరుకు చెందిన తన్మయి నాగదుర్గ 1500 మీటర్ల రోడ్డు రేస్‌లో సిల్వర్ మెడల్, 500 మీటర్ల రింక్ రేస్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. తన్మయి మంగళగిరి నిర్మల సీబీఎస్‌ఈ స్కూల్‌లో 5వ తరగతి చదువుతోందని తెలిపారు. జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి విజేతగా నిలిచిన బాలికను స్కూల్ యాజమాన్యం, స్కేటింగ్ కోచ్ ఎస్‌కే ఖాజా, ఫిట్‌నస్ కోచ్ సుధాకర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రామాలయ పునఃప్రతిష్ఠ



దుగ్గిరాల: శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ రామచంద్ర స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. దుగ్గిరాల యాదవపాలెంలో శుక్ల పక్ష ఏకాదశి సందర్భంగా ఉదయం 7.56 గంటలకు విగ్రహ పునఃప్రతిష్ఠాపన జరిపారు. 5 రోజుల పాటు జరిగిన ఉత్సవాల అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

టైలర్ షాపులో అగ్ని ప్రమాదం



మేడికొండూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి టైలర్ షాపు దగ్ధమైన సంఘటన మండలంలోని పేరేచర్లలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. షాపు యజమాని షేక్ జమీర్ ఉదయం షాపు తీసి మధ్యాహ్నం వరకు బట్టలు కుట్టాడు. అనంతరం షాప్ మూసి వేసి భోజనానికి ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి షాపులో దట్టమైన మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక శాఖ సిబ్బంది తమ వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. టైలర్ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. ప్రమాదంలో టైలర్ షాపులో నాలుగు అధునాతనమైన ఖరీదైన కుట్టు మిషన్లు, కస్టమర్లవి కొత్తగా ఇచ్చిన బట్టలు, కుట్టి పూర్తయిన తర్వాత డెలివరీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచినవి మొత్తం రూ.2 లక్షల వరకూ ఉంటాయని అన్నాడు. తన కుటుంబ జీవనోపాధి బతుకుదెరువు టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నానంటూ బాధితుడు వాపోయాడు.

డాక్టర్ జాన్‌పాల్‌కు ఘన సత్కారం



డాక్టర్ జాన్‌పాల్, సుధారాణి దంపతులను సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నాగవేణి

తెనాలి రూరల్: బెంగళూరులోని న్యూ విజన్ బైబిల్ కళాశాల నుంచి ఇటీవల డాక్టరేట్ పొందిన పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చి అధినేత బిషప్ డాక్టర్ పినపాటి జాన్‌పాల్‌ను పలువురు ప్రముఖులు సత్కరించారు. చర్చి ఆవరణలో బుధవారం రాత్రి జరిగిన సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ ప్రముఖులైన బిషప్ పాముల పరంజ్యోతి, బిషప్ ప్రవర్ధన్ వర్మ, బిషప్ విక్టర్ పాల్, దైవజనులు సువర్ణరాజు, మల్లవరపు విజయ్‌కుమార్, జూనియర్ థామస్, విలియంకేరి, రజనీకాంత్, సమాజ్‌వాది పార్టీ నాయకుడు తమనం భూషణం అతిథులుగా పాల్గొన్నారు. జాన్‌పాల్ చేస్తున్న పరిచర్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. డాక్టర్ జాన్‌పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాక్ గాస్పెల్ చర్చి ఆవరణలో ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఆయన్ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈవూరు శ్రీనివాసరావు, ఆరె దానియేలు, కసుకుర్తి భాస్కరరావు, జయరాజు, కఠెవరపు ఏసుదాసు, పినపాటి ఫ్రాన్సిస్, ఈవూరి ఏసురత్నం, సంఘస్తులు, తెనాలి, గుంటూరు, పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు దైవజనులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

- చైనా కేంద్రంగా 5 వేల లోన్‌యాప్స్
- ఒక యాప్‌కు సమాచారమిస్తే మొత్తం యాప్స్‌కు ఇచ్చినట్టే
- అవగాహన సదస్సులో సైబర్ క్రైమ్, గుంటూరు ఇన్‌చార్జ్ రాజ్‌కిషోర్



మాట్లాడుతున్న రాజ్‌కిషోర్

తెనాలి: టెక్నాలజీ పెరిగిన నేటిరోజుల్లో అదేస్థాయిలో విస్తరిస్తున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగివుండి అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైం, గుంటూరు ఇన్‌చార్జ్ రాజ్‌కిషోర్ అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. యూత్ సర్వీసెస్ 'స్టెప్' ఆధ్వర్యంలో ఏర్పాటైన సదస్సుకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. రాజ్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ సైబర్ నేరాల గురించి తెలియజేశారు. ముఖ్యంగా తెలియని లింక్స్ యాప్స్ ఉపయోగించవద్దని స్పష్టంగా చెప్పారు. అలానే పర్సనల్ లోన్‌యాప్స్ గురించి కూడా జాగ్రత్త వహించాలన్నారు. చైనా కేంద్రంగా దాదాపు అయిదు వేలకుపైగా లోన్ యాప్స్ ప్రస్తుతం ఇంటర్‌నెట్‌లో ఉన్నాయని, ఒక యాప్‌కు స్పందించి మనం సమాచారం ఇస్తే, అది అయిదు వేల యాప్స్‌కు చేరుతుందని చెప్పారు. లోన్‌యాప్స్‌ను ఎవరూ డౌన్‌లోడ్ చేసుకోవద్దని చెబుతూ లోన్‌యాప్‌తో ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే మొబైల్‌లోని సిమ్‌ను తొలగించి, ఒక వారం తర్వాత మళ్లీ ఉపయోగించుకోవాలని సూచించారు. తొందరపడి ఈ కామర్స్ వెబ్ సైట్స్, యాప్స్‌లో పర్సనల్ డేటాని ఇవ్వొద్దని తెలిపారు. డిజిటల్ శకంలో ఎక్కువగా ఉన్న భారత యువత ఎంత జాగ్రత్త వహిస్తే అంత సురక్షితంగా ఉంటారని చెప్పారు. 'స్టెప్' సీఈవో చంద్రముని, రాధిక, ఏఎస్ఐ జార్జ్ బాబు పాల్గొన్నారు.

నేడు సింహమంటి చిన్నోడు సాంఘిక నాటిక ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివనాగేశ్వరరావు

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో శుక్రవారం రాత్రి 9 గంటలకు సింహమంటి చిన్నోడు సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్, గోల్డ్ డైరెక్టర్ గంపల శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాటకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలిన రాజకీయాలకు అర్థంపట్టే సింహమంటి చిన్నోడు నాటికను సరికొత్త కథనంతో రాజకీయ నాయకులకు కన్నువిప్పు కలిగే విధంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ ప్రయోజనాలు కోసం కాకుండా సమా జం కోసం భావితరాల భవిష్యత్ కోసం నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకట్, రామరాజు, శ్రీనివారాసరావు, హైమరావు, రమేష్‌బాబు, విజయసారథిబాబు, లక్ష్మణరాజు, కొండంరాజు, రోజా, కొమలి, సంధ్య, అశోక్ గజపతిరాజు, లక్కరాజు బాబ్జి, గోపిరాజు, శ్రీనివాసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు విస్తరించాలి

తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ



జీన్ హెన్నీ డ్యూనంట్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సంజనా సింహ

తెనాలి: ప్రకృతి విపత్తులలో సహాయ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్రథమ చికిత్స శిక్షణ శిబిరాలు, పునరావాస సేవా కార్యక్రమాలతో రెడ్‌క్రాస్ సేవలు అన్ని వర్గాల వారికి విస్తృతస్థాయిలో అందుతున్నాయని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అన్నారు. మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరాలని కోరారు. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'సర్ జీన్ హెన్రీ డ్యూనంట్ 'జన్మదినం రోజున ప్రపంచవ్యాప్తంగా రెడ్‌క్రాస్ వేడుకలు నిర్వహిస్తారని సర్ జీన్ హెన్నీ డ్యూనంట్ ఆశయ సాధన కోసం అందరూ ముందుకు రావాలని అభిప్రాయపడ్డారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, ఇతర ప్రకృతి వైపరీత్యాలలో, యుద్ధ సమయాలలో రెడ్‌క్రాస్ వాలంటీర్స్ చేసే సేవలు వెలకట్టలేనివని చెప్పారు. రెడ్‌క్రాస్ సేవలను అందరూ ఆదర్శంగా తీసుకొని రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరి సామాజిక సేవలలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ వేడుకలో భాగంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సబ్ కలెక్టర్ ప్రారంభించారు. తెనాలి రెడ్‌క్రాస్ చైర్మన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, రెడ్ క్రాస్ కార్యనిర్వాహక సభ్యులు కుర్రా శ్రీనివాస్, కొత్త కృష్ణకుమార్, కొంజేటి మురళి, డాక్టర్ పావని ప్రియాంక, రెడ్‌క్రాస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్‌కే జానీ రసూల్ పాల్గొన్నారు. తొలుత జీన్ హెన్నీ డ్యూనంట్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ధ్వజస్తంభ ఊరేగింపు మహోత్సవం



వాహనంలో ఊరేగిస్తున్న ధ్వజస్తంభం

యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెంలో శ్రీ భక్తాంజనేయ స్వామి విగ్రహ, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ధ్వజస్తంభ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాషాయ జెండాలతో నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీ కనుల పండువుగా సాగింది. స్వామివారి వేడుకలు 14న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.